www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 13 ఆగస్టు 2024
5
చిత్తూరు

వెదురు మోపు..
స్మగ్లింగ్ భలే ఊపు..!

అడవులు మానవళి మనుగడకు ఎంతో దోహదపడుతాయి. అడవితల్లిని రక్షించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉంది. ఎన్నో రకాల పండ్లు, ఔషద మొక్కలు లభిస్తున్నాయి. స్వార్ధపరులు ధన దాహంతో అటవీ సంపదను అమ్మి సొమ్ము చేసుకొనే అడ్డదారులను ఎంచుకొన్నారు. వెదురు, కలప వంటి విలువైన సంపదను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. నిలువరించాల్సిన అటవీ అధికారుల చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయని ప్రకృతి ప్రేమికులు విమర్శిస్తున్నారు. - ప్రజాశక్తి-సోమల

- తరలిపోతున్న వెదురు
- పట్టించుకోని అధికారులు
- ప్రశ్నార్థకంగా అటవీ సంపద సంరక్షణ

అక్రమంగా నిల్వ ఉంచిన వెదురు మోపులు

తరలించుకుపోతున్న వెదురు

మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలో అడవులు విస్తారంగా ఉన్నాయి. అడవులలో ఎన్నో రకాలైన వృక్షాలు, మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంతరించుకొన్నాయి. అధికంగా ఉన్న వెదురును అక్రమంగా స్మగ్లింగ్ చేపడుతున్నారు. చాటుగా అటవీ ప్రాంతం నుంచి

తరలించుకుపోతున్న వెదురు

వెదురు మోపులను అనుకూల ప్రదేశాలకు చేర్చుకొని అక్కడి నుంచి ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నట్లు సమాచారం. రెండు వేల నుంచి 5వేల వెదురు కట్టెలను ఒక్కసారిగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారమంతా అటవీ అధికారులకు తెలిసినా కాసుల మత్తులో మూగబోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంతరించిపోయే ప్రమాదం..

అధికంగా వెదురు ఉన్న ప్రాంతాల్లో 81 చిన్న ఉప్పరపల్లి, బోనమంద ప్రత్యేకం. ఇక్కడ అధికాంగా వెదురు దొరకుతుండడంతో అక్రమార్కులు ఈ ప్రాంతాలనే టార్గెట్ చేసుకున్నారు. అధికారుల చర్యలు లేకుంటే కొంత కాలానికి ఆ ప్రదేశంలో అంతరించిపోయే ప్రమాదం ఉందని స్థానికులు, ప్రకృతి ప్రేమికులు అంటున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని వెదురు అక్రమ రవాణా అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

నిరంతరం పర్యవేక్షిస్తాం..

వెదురు అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతరం పర్యవేక్షిస్తాం. పట్టుబడిన వారిపై కేసులు మోపుతున్నాం. చర్యలు మరింత కఠిన తరం చేస్తాం. అధికారుల ప్రమేయంపై ఆరా తీసి చర్యలు తీసుకుంటాం.

- శ్రీరాములు, రేంజ్ అధికారి, పుంగనూరు

అక్రమ రవాణా జరగలేదు..

బోనమంద ప్రాంతంలో పట్టా భూమిలోంచి యజమాని వెదురు తరలించారు. అక్రమ రవాణా జరగలేదు. నిత్యం అటవీ ప్రాంతంలో పర్యవేక్షిస్తున్నాం. అక్రమంగా తరలిస్తుండగా సోమవారం కూడా కేసు నమోదు చేశాం. సిబ్బంది ఎవరూ మామూళ్ళకు పాల్పడలేదు. వెదురును రక్షిస్తాం.

- బాల సుబ్రమణ్యం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, పెద్ద ఉప్పరపల్లి

సీఐటీయూ ఫిర్యాదు..
అక్రమ ఇంటర్వ్యూలు రద్దు
రీ నోటిఫికేషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టులో అక్రమంగా నిర్వహించిన ఇంటర్వ్యూలను రద్దు చేయాలని సిఐటియ ఆధ్వర్యంలో గత వారం కుప్పంలో ఆందోళన చేపట్టినా లెక్క చేయకుండా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోమవారం చిత్తూరు కలెక్టరేట్లో కలెక్టర్‌కి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు ఫిర్యాదు చేశారు. జిల్లాకు సమాచారం ఇవ్వకుండా ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఐసిడిఎస్ పీడీని పిలిచి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా విఓఏలను తొలగిస్తున్న ఏపిఎం సీసీలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అక్రమంగా తొలగిస్తున్న మండలాల్లో ఎంక్వయిరీ చేసి జిబి తీర్మానాలు లేకుండా విఓఏలను తొలగించిన ఏపిఎం, సీసీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. యూనియన్ ఇచ్చిన ఫిర్యాదులో రొంపిచర్ల, పులిచర్ల, సోమల, చౌడేపల్లి, రామకుప్పం, గుడిపల్లి, ఎస్ఆర్ పురం, కార్వేటినగరం తదితర మండలాల్లో అక్రమంగా తొలగిస్తున్నారు. చిరు ఉద్యోగులపై అక్రమ వేధింపులకు పాల్పడుతున్న వారిపై అధికారులు స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని వాడ గంగరాజు హెచ్చరించారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఎయిడ్స్‌పై అవగాహన, వివరాలను పొందేందుకు ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నెంబర్ 1097 నెంబర్‌ను ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నేకో మార్గదర్శకాలతో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో "మీకు తెలుసా" పేరిట "ఇంటెన్సిఫైడ్ ఐఇసి క్యాంపెయిన్" రెండు నెలల పాటు జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన బ్యానర్‌ను జేసీ పి.శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతీ దేవి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంటకట ప్రసాద్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ గర్భిణి స్త్రీకి మొదటి మూడు నెలల్లోనే హెచ్ఐవి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషిచేయాలని కోరారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జనాభాలో హెచ్ఐవి, సుఖ వ్యాధులు(ఎస్టీఐ)ల గురించి పరిజ్ఞానం, అవగాహన పెంపొందించడానికీ, సురక్షిత పద్ధతులు, హెచ్ఐవి ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తామని వివరించారు.

పోలీస్ మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలను అన్ని విధాల ఆదు కుంటామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. చిత్తూరు హోం గార్డ్స్ యూనిట్‌లో ఫిబ్రవరి 10న విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన జె.పట్టాబి సతీమణి బి.గీతకి కారుణ్య నియామ కాల క్రింద "సి" కేటగరీలో ఉద్యోగం కల్పిస్తూ సో మవారం ఎస్పీ ఉద్యోగ ఉత్తర్వుల పత్రాలను అం దించారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ మహబూ బ్ బాష, హోం గార్డ్ ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్‌కి దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉచిత డీఎస్సీ కోచింగ్‌కి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారత అధికారి ఏ.మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని ఎరుకుల, సుగాలి, యానాది, గిరిజన కులాలకు చెందిన నిరుద్యోగులకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు బీఈడీ, డీఈడీ, టెట్ కోర్సులు పూర్తి చేసుకున్న వారు అర్హులన్నారు. తిరుపతిలో ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు 16వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. వివరాలకు 08572-241056ను సంప్రదించాలని సూచించారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 16 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ మేరకు యంత్రాంగం సన్నద్ధం కావాలని కన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్‌లను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘాల డిజిటలైజేషన్ పూర్తి చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అక్టోబర్ 2వ తేదీ లోపు అన్ని సహకార సంఘాలు డిజిటలైజేషన్ పూర్తి చే యాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధి కారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్, జెసీ శ్రీనివాసులుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, సహకార శాఖ అధికారులతో డిజిట లైజేషన్‌కి సంబంధించి సమీక్షించి దిశానిర్దేశం చేశారు.

నైబర్ వుడ్ సర్వేలో భాగస్వామ్యం కండి: డీఆర్‌డీఏ పీడీ తులసి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వయం సహాయ సంఘాల జీవనోపాది పెంపు కోసం నిర్దేశించిన నైవేవర్ వుడ్ బిజినెస్ సర్వేలో ప్రతి ఒక్క సభ్యురాలు భాగస్వామ్యం కావాలని చిత్తూరు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. సోమవారం ఆమె చిత్తూరులో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుతో మహిళల్లో ఆర్థిక సామాజిక పరంగా చైతన్యం వచ్చిందని, అయితే స్వయం సహాయక సంఘ సభ్యులు మరింత మెరుగైన జీవనోపాదులు పొందేందుకు ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. సభ్యులు వారి పిల్లలు చదువుకొని ఉపాధి అవకాశాలు లేక జీవనం గడుపుతున్న వారికి ఇంటి వద్దనే తమ విద్యార్హతతో పాటు ఎంచుకున్న వృత్తిలో ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సంఘమిత్రాల ద్వారా నైబర్ వుడ్ సర్వే కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇందులో ప్రతి సంఘ సభ్యురాలు భాగస్వాములు కవాలని, సమగ్ర వివరాలను అందించాలని సూచించారు. తద్వారా సంఘ సభ్యుల జీవన ప్రమాణాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హనుమంతరావు, డాక్టర్ శిరీష కోరారు. సోమవారం స్థానిక పివికేఎన్ డిగ్రీ కళాశాలలో నాసా ముక్తభారత్ అభియాన్, పొగాకు, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి మాట్లాడుతూ యుక్త వయసు పిల్లలు మాదక ద్రవ్యాలైన కొకైన్, హెరాయిన్, మార్ఫిన్, నల్లమందు లాంటివి, పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, హాన్స్, పాన్ పరాగ్, గుట్కా, నశ్యం లాంటివి వాడకంతో జరిగే అనర్థాలు, అనారోగ్య పరిస్థితులు, వివిధ రకాల క్యాన్సర్లు మూలం అవుతున్నారు. ఇలాంటి వాటికి అలవాటై జీవితం నాశనం చేసుకుంటున్నారన్నారు. వీటి నుండి బయటపడటం కష్టతరం కావున వీటికి దూరంగా ఉండాలని సూచించారు. డాక్టర్ హనుమంతరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్, నవనీశ్వర్ రెడ్డి, భాను ప్రకాష్, లావణ్య, మూర్తి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సోమల: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పంచాయతీ కార్యదర్శి సుధాకర్‌కుమార్ అన్నారు. సోమల పంచాయతీలో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు సచివాలయ సిబ్బంది, ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమర్నాథ్ పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా..

- కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రతి ఒక్కరిలో దేశభక్తి పెంపొంది ంచేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహిం చాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కలెక్టర్, జేసీ పి.శ్రీని వాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్‌ఓ బి.పుల్లయ్య డ్వామా పీడీ ఎన్.రాజశేఖర్ జాతీయ జెండాలను చేతపట్టి జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను సమగ్రతను కాపాడటం మనందరి భాధ్యత అని, ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 12 నుంచి 15 వరకు విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగంతో స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వాములు కావాలని దేశ సమగ్రతను కాపాడే ఈ మహోన్నత కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విద్యా కార్పొరేటీకరణ తగదు: యూటీఎఫ్

చిత్తూరులో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యా కార్పొరేటీకరణ తగదని యూటీఎఫ్ నేతలు అన్నారు. సోమవారం చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయం వద స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. విద్యా కార్పొరేటీకరణను నిరసిస్తున్నట్టు నేతలు తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యా, వైద్య పరంగా కార్పొరేటీకరణ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో భవిష్యత్ భారత్ అంధకారంలోకి వెళుతున్నదని, ఇది ప్రమాదకరంగా మారుతున్నదన్నారు. అదే విధంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ, జిల్లా నాయకులు పి.సుధాకర్ రెడ్డి, రెహానా బేగం, రెడ్డెప్ప నాయుడు, ఎస్పీ బాషా, పార్థ సారధి, గణేష్ కుమార్, సునందన రెడ్డి, విజయ నాయుడు, జబరాజ్, జయరామన్, బాబూ, రమేష్ నాయక్, రవి, సురేష్ బాబు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరు యూటీఎఫ్ కార్యాలయంలో 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విశ్రాంత సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు హాజరై పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కే.గురుమూర్తి, జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పిసి బాబు, గౌరవాధ్యక్షులు బషీర్ బాష, మండల అధ్యక్షులు ఎస్.హేమచంద్ర రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రత్యూష, కుమార్ స్వామి పాల్గొన్నారు.

పలమనేరులో

ఉపాధ్యాయులలో ఉద్యమ స్ఫూర్తి నింపాలి

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ

బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఉపాధ్యాయులలో ఉద్యమ స్ఫూర్తి నింపాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం యుటిఎఫ్ 1974లో ఆగస్టు నెలలో ప్రారంభించారని అప్పటి నుండి నేటి వరకు ఉపాధ్యాయ సమస్యలపై పలు పోరాటాలు చేసి ఉపాధ్యాయ హక్కులను సాధిస్తున్నామని ప్రతి విజయం వెనక యుటిఎఫ్ ఉన్నదని సర్వోత్సవాలు జరుపుకోవడం మనందరికీ శుభదాయమన్నారు. ప్రతి ఒక్కరు ఉద్యమస్ఫూర్తితో విధులు చేపట్టాలన్నారు. మాజీ రాష్ట్ర కౌన్సిలర్ సాంబశివన్ జెండా ఆవిష్కరణ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సరిత, మండల ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, కోశాధికారి మహేష్ బాబు, నాయకులు బాలాజీ, కృష్ణమూర్తి, బంగారు మురళి, పొన్నమని, రఘుపతి నాయుడు, నాగయ్య, రవిచంద్ర, లీలావతి పాల్గొన్నారు.

ఆర్.కె.అబాకస్ విద్యార్థికి అవార్డు ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బైరాగిపట్టెడలోని ఆర్.కె.అబాకస్ శిక్షణ కేంద్రంలో ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా శిక్షణ పూర్తి చేసిన ఏపికి చెందిన ఎన్ఆర్ఐ విద్యార్థి (నెదర్లాండ్స్) కాలసముద్రం దర్శిల్ అంతర్జాతీయ స్థాయిలో అబాకస్ పోటీల్లో ప్రథమ అవార్డు పొందారని ఆర్.కె.అబాకస్ ఛైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా గత 10 సంవత్సరాలుగా వేలాది మందికి శిక్షణ ఇస్తూ, వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి విజ్‌కిడ్ ఎడ్యుకేషన్ చెన్నై వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా జాతీయ, అంతర్జాతీయ పోటీలు నిర్వహించి, అవార్డులు ప్రదానం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె.అబాకస్ డైరెక్టర్, వీక్ష స్కూల్ హెడ్‌మాస్టర్ ఆర్.కె.విమల, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి రమాదేవి పాల్గొన్నారు.

అమ్మో.. కొండచిలువ

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం గుడ్లనాయనపల్లి గ్రామ పరిధిలోని పంట పొలాలలో సోమవారం కొండచిలువ కలకలం రేపింది. పంట పొలాలలో కొండచిలువను గమనించిన రైతులు భయంతో పరుగులు పెట్టారు. వెంటనే సమాచారాన్ని అటవీ శాఖ అధికారులకు తెలిపారు. అక్కడికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది చాకచక్యంగా కొండచిలువను బంధించి సురక్షితంగా అటవీ ప్రాంతంలో వదిలిపెట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవం


రామకుప్పంలో

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని ననియాల ఏనుగుల సందర్శన కేంద్రంలో అట్టహాసంగా ప్రపంచ ఏనుగుల దినోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిదులు, అధికారులు, నాయకులు పాల్గొని ననియాల, ముద్దనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో చెట్లు నాటారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు చెట్లు నాటి పర్యావరణాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా సూచించారు. ఏనుగుల సందర్శన కేంద్రంలో జయంత్, వినాయక్ అనే శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను సుందరంగా అలంకరించి ప్రదర్శించారు. వాటికి ఇష్టమైన వివిధ రకాల పండ్లను ఆహారంగా అందించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణా నాయక్, రామమూర్తి, జేఈ, మనోహర్, విశ్వనాథ్, వెంకటాచలం, మురళి, రఘు, గజేంద్ర, లోకేష్, నాగరాజు, సుబ్రహ్మణ్యం నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

సోమల: ఏనుగుల దినోత్సవం సందర్భంగా సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అటవీ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించి ఏనుగుల ఆవశ్యకత, వాటితో మానవులకు ఉన్న సంబంధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌బివో శ్రీనివాసులు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, సిబ్బంది కిరణ్ కుమార్, చంద్రబాబు పాల్గొన్నారు. అదేవిధంగా చౌడేపల్లి మండలం చారాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రాకేష్, ఎఫ్‌బివో రవికుమార్, శోభనాద్రి, బాలసుబ్రమణ్యం, ఏబీవో రాధమ్మ, ఎలిఫెంట్ ట్రాకర్స్ శశి కుమార్, కుమార, సుందరయ్య పాల్గొన్నారు.

పలమనేరు: పట్టణంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. అటవీశాఖ కార్యాలయం నుంచి బాలికల పాఠశాల విద్యార్థులతో కలిసి "రక్షిద్దాం రక్షిద్దాం.. ఏనుగులను రక్షిద్దాం" అంటూ నినాదాలు చేస్తూ క్లాక్ టవర్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: మండలంలోని చేకలు చేను ఎంపీపీ పాఠశాల ఆవరణంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని పుంగనూరు అటవీ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఏనుగుల జీవనశైలి, వాటి ఆహార అలవాట్లు తదితర అంశాలపై పాఠశాల పిల్లలకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాలసుబ్రమణ్యం, బీట్ ఆఫీసర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వినతుల వెల్లువ.!

- జిల్లా కేంద్రానికి పోటెత్తిన ప్రజలు
- సమస్యలపై అధికారులకు విజ్ఞప్తి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో ప్రజలు కలెక్టరేట్ బాట పట్టారు. అర్జీల రూపంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజల విన్నపాలను స్వయంగా విన్నారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఆదేశించారు. యాదమరి మండలం కినాటం పల్లి పంచాయతీ షికారు కాలనీకి చెందిన శైలు, అరుణ్ దంపతులు 35ఏళ్లనాటి ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉందని, ప్రభుత్వం ద్వారా నూతన ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా వారు గ్రామ సమస్యలను కలెక్టర్‌కి వివరించారు. వెంటనే గ్రామాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వేగంగా వినతుల పరిష్కారం: కమిషనర్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందే వినతులను వేగంగా పరిష్కరించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నగర ప్రజలు అందించిన వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్-3, టిడ్కో-2, టౌన్ ప్లానింగ్ -2, పీహెచ్‌సీ-1, రెవెన్యూ-1, మెప్మా-1 చొప్పున మొత్తం 10 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆరిఫుల్లా, దిశా డీఎస్పీ సుధాకర్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

కుప్పంలో 52 అర్జీలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో కడా పిడి వికాస్ మర్మత్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా 52అర్జీలు అందినట్టు తెలిపారు. కాగా ఇందులో 26 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవి వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను పరిశీలించి వాటి ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని కాల పరిమితిలోపున సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

'అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహార తోటలు పెంచాలి'

ప్రజాశక్తి-కార్వేటినగరం: అంగవ్వాడీ ఆవరణాల్లో పోషకాలు అందించే తోటల పెంపకాన్ని విధిగా చేపట్టాలని రాస్-కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత డాక్టర్ శ్రీలత అన్నారు. సోమవారం మండలంలోని ఆర్కేవీబీపేట దళితవాడలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార తోటల పెంపకంపై అంగన్వాడీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ శాస్త్రవేత మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం అందించే తోటలను పెంచేలా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. కూర గాయలు, ఆకుకూరలు అందుబాటులోకి తీసుకురావడమే రాస్-కృషి విజ్ఞాన కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశమని చెప్పారు.

అన్నదానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: జీడీ నెల్లూరు పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎంపి శ్రీధర్ రెడ్డి ఆర్థిక సహాయంతో రోగులకు సోమవారం అన్నదానం చేపట్టారు. రోగులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. సహాయ సహకారాలు అందించిన డాక్టర్ దుర్గాదేవి, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, రెడ్ క్రాస్ మండల ప్రెసిడెంట్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

'పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి'

ప్రజాశక్తి-కార్వేటినగరం: పారిశుద్ధ్యంపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో లక్ష్మీపతి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తూ, ప్రజలు వ్యాధుల భారిన పడకుండా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు పీఎస్ మణి, లోకేష్ పలువురు సర్పంచ్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి-సదుం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో రాజశేఖర్ బాబు, ఈవోపీఆర్డీ వరప్రసాద్, రొంపిచర్ల సీనియర్ పంచాయతీ కార్యదర్శి, టీవో డి నాగరాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ రాజ్ చట్టం అనుసరించి పంచాయతీలలో నిర్వహించు సమావేశాలు, వీటికి సంబంధించిన కమిటీల ప్రోసీడింగ్స్, నియమావళి రూల్స్‌కు సంబంధించిన విషయాలుపై కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సదుం ఈఓ హసీనా, సర్పంచులు ఉషా రాణి, వరలక్ష్మి, మురళీ రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటరమణ, అనితా కుమారి, దీప పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 11మంది సర్పంచులు దుమ్మా కొట్టడం గమనార్హం.

'పంచాయతీ నిధులపై అవగాహన ఉండాలి'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పంచాయతీ నిధులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ తరగతులు జరిగాయి.

ఈ పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-గుడిపల్లి: రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి నాగరాజు కోరారు. పట్టాదారు పాసుపుస్తకం, 1బి, మొబైల్ నెంబర్‌తో ఆర్‌బీకేల్ సంప్రదించాలని తెలిపారు. సోమవారం మండలంలోని బెగ్గిలపల్లి, కనమనపల్లి, గుండ్లసాగరం ఆర్‌బీకే పరిధిలో ఆయన ఈ పంట నమోదును పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏసుమణికి నివాళి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని 49 కొత్తపల్లి మిట్టలోని వైసిపి మండల కోఆప్షన్ నెంబర్ యేసురత్నం భార్య ఏసుమణి (61) ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎంసీ విజయానంద రెడ్డి సోమవారం ఆమె భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు గురువారెడ్డి, విజయబాబు, జనార్దన్, గోవిందరెడ్డి, టీఆర్ దొరస్వామి, ఆదెయరాజు, కనకరాజు, సర్పంచ్ మార్కొండయ్య, మునిచంద్రన్ పాల్గొన్నారు.

స్కావెంజర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- మండల విస్తరణ అధికారి శ్రీనివాస్

ప్రజాశక్తి-పూతలపట్టు: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని స్కావెంజర్స్ (మరుగుదొడ్ల పరిశుభ్రం దారులు)లను గుర్తించడం జరుగుతుంది. వీరిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలు మండలంలో పర్యటిస్తున్నట్లు మండల విస్తరణ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి వారు ఉంటే ఈ నెల 14 లోపు ఎంపీడీవో కార్యాలయంలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

కంటి చికిత్సకు 34మంది ఎంపిక

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కంటి శస్త్ర చికిత్సకు 34మంది ఎంపికైనట్లు శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ నిర్వాహకులు మురళి తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అందులో 60మంది పరీక్ష చేయించుకోగా 34మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి ఉచితంగా చెన్నైలో ఆపరేషన్లు చేయిస్తామని వివరించారు.

ముగిసిన పాలేటి అమ్మవారి జాతర

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీలోని ఆది, సోమవారాలలో జరిగిన పాలేటి అమ్మవారి జాతర భక్తిశ్రద్ధలతో అత్యంత ఆనంగా వైభవంగా ముగిసింది. ఆదివారం రాత్రి 8 చాందిని బండ్లు ఆలయం చుట్టూ ప్రదర్శించారు. సోమవారం ఉదయం మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా పుష్ప పల్లకిపై ఊరేగించారు. ఆలయ పరిసరాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కౌన్సిలర్

ప్రజాశక్తి - వెంకటగిరి: వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని 14 వ వార్డు కౌన్సిలర్ ఆది శంకరయ్య తెలిపారు. సోమవారం వెంకటగిరి మునిసిపాలిటీ పరిధి లోని సుదర్శన్ నగర్ సచివాలయంలో ప్రజా సమస్యల పైన జరిగిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుండి వినతులను కౌన్సిలర్ శంకరయ్య అర్జీలు స్వీకరించారు. ప్రజాసమస్యలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి-పూతలపట్టు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 300 అడుగుల జాతీయ జెండా చేత పట్టి విద్యార్థులతో కలిసి పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. కుల మత పార్టీలకతీతంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసి దేశభక్తిని చాటాలని పూతలపట్టు నియోజకవర్గం ప్రజానీకంకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరిలోనూ జాతీయ భావనను పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంను ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టిన రోజు సందర్భంగా కళాశాలలో గ్రంథాలయ దినోత్సవంను ఘనంగా జరిపారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జింకా లక్ష్మినారాయణ మాట్లాడుతూ గ్రంథాలయ ఆవశ్యకతను, పుస్తక పఠన ఆవశ్యకతను గూర్చి వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.నారాయణ మూర్తి మాట్లాడుతూ గొప్ప గొప్ప విజయాలు సాధించాలంటే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని, పుస్తకంలోని మంచి విషయాలను తెలుసుకొని విషయ పరిజ్ఞానం పెంచుకొని గొప్ప వ్యక్తిగా ఎదగాలని సూచించారు. ఐ.క్యూ ఏ.సి కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ పుస్తక పఠనంను దిన చర్యగా అలవాటు చేసుకోవాలని చెప్పారు. తెలుగు అధ్యాపకులు చంద్రబాబు మాట్లాడుతూ పుస్తకాలు చదివి అత్యంత గొప్ప స్థాయిలో నిలిచిన మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞాన ఖని ఉంటుందని దానిని అందరూ వాడుకోవాలని సూచించారు. గ్రంథాలయ విభాగానికి చెందిన అధ్యాపకులు బాలకృష్ణ మాట్లాడుతూ వ్యక్తిని పరిపూర్ణ వ్యక్తిగా తీర్చి దిద్దేది పుస్తకాలు అని, విజ్ఞాన సోపానాలు అని తెలిపారు.

నరసమ్మకు నివాళి

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు మాసిలా మణి తల్లి నరసమ్మ (71) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నరసమ్మ మృత దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని ఓదార్చారు. నారాయణస్వామి వెంట ఎంపీపీ లతలాజీ, మాజీ మండల కన్వీనర్ ధనంజయవర్మ, ఎంపీటీసీ మురుకన్న, మాజీ సర్పంచ్లు అమీద్, అంకయ్య, ఆశీర్వాదం, ఆర్. సుబ్రమణ్యం, పలువురు నాయకులు ఉన్నారు.

గుడిపల్లి ఎంపిడివోగా తాజ్ మన్సూర్ బాధ్యతలు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండల ఎంపీడీవోగా తాజ్ మన్సూర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లారు. తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

విజయపురం ఎంపిడిఓగా ఎంవి రమణ

ప్రజాశక్తి-విజయపురం: మండల ఎంపీడీవోగా ఎం.వి.రమణ ప్రతాప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏవోగా పని చేస్తూ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఐరాల ఎంపిడిఓగా నాగరాజు

ప్రజాశక్తి-ఐరాల: ఐరాల మండల ఎంపీడీవోగా నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈయనను నెల్లూరు జిల్లాకు బదిలీ చేశారు. ఎన్నికల అనంతరం తిరిగి ఐరాలకు ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు.

నీట మునిగిన పొలాలు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలో కుంభవృష్టి వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి చిన్న చిన్న గుంటలు, కాలువలు సైతం జలమయమైయ్యాయి. మండలంలో నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరిపంటలు నేలకొరిగింది. ఇళ్ళత్తూరు వద్ద వరద కాలువలను, రోడ్డుకు ఇరువైపుల ఉన్న కాలువలను ఆక్రమణ చేసుకోవడంతో ఇళ్ళత్తూరు ఎన్ఎన్ కండ్రిగ రోడ్డుపై వర్షపునీరు నిలిచి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నదని గ్రామస్తులు వాపోతున్నారు. కాలువలు లేని కారణంగా వరద ఉధృతినీరు పంట పొలాలపైనే పారడం వలన పంటలు కుళ్లిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారలు స్పందించి ఆక్రమణలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

బాలికల చదువు.. దేశానికి వెలుగు..

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: బాలికల చదువు దేశానికి వెలుగు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఏర్పేడు మండలంలోని పల్లం హైస్కూలు, పాపానాయుడు పేట హైస్కూలు, ఇంటర్ కళాశాలలో క్ర సంస్థ పిలుపు మేరకు ప్రగతి సంస్థ పిల్లలతో డ్రాయింగ్ కాంపిటీషన్, బాలికల చదువు ప్రాముఖ్యత అనే అంశంపై వంద మంది పిల్లలతో డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. పిల్లలు రకరకాల అంశాలపై డ్రాయింగ్ వేయగా 40 మందిని ఎంపిక చేశారు. ఈ పోటీలో కళాశాల ప్రిన్సిపల్, స్కూల్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, ప్రగతి సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సాయిబుల పల్లె గ్రామ సమాఖ్య సమావేశంలో, రంగన్నగారి గడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ కుష్టు, సీజనల్ వ్యాధులపై సోమవారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలు లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం ముఖంపై నూనె రాసినట్టు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం, తదితర లక్షణాలు వుంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని, వ్యాధి నిర్ధారణ కోసం దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల్ని సంప్రదించాలని తెలిపారు. కుష్టువ్యాధి నిర్ధారణ అయితే ఖరీదైన మందులు, శస్త్ర చికిత్సలు ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేస్తారన్నారు. దోమల నివారణ కు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సౌజన్య, సంఘసభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం

చెవిరెడ్డికి టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు సవాల్

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరిలో భూకబ్జాలకు పాల్పడుతున్నానని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నాడని దమ్ము, ధైర్యం ఉంటే నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు సవాల్ విసిరారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలో ఓ న్యూస్ ఛానల్ డిబేట్‌లో చెవిరెడ్డి పేర్కొన్నట్లు అవినీతి ఆరోపణలు చేసి తనపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడని, అసత్య ఆరోపణలు చేయడం, ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టడం, వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి నైజమని పేర్కొన్నారు. సొంత పత్రిక వుందని పదే పదే అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. భూ కబ్జాకు పాల్పడినట్లు ఆరోపించడం కాదు.. వాస్తవాలు నిరూపిస్తే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని తెలిపారు. 10 ఏళ్ల క్రితం ఓ బైక్ పై తిరిగే చెవిరెడ్డికి 5 వేల కోట్లకు పైగా ఆస్తులు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. టిటిడి పేరు పెట్టి దాతల నుంచి తుమ్మలగుంట ఆలయానికి వచ్చిన నిధులు ఎంత? కోట్లు రూపాయల మఠం భూములు కబ్జా చేసింది ఎవరు? రూ.150 కోట్లు తుడా నిధులతో తుమ్మలగుంట చెరువు కబ్జా చేసింది ఎవరు? అని సుబ్రహ్మణ్యం నాయుడు ప్రశ్నించారు. చెవిరెడ్డి అవినీతిపై సత్య ప్రమాణానికి తాను సిద్ధం అని సవాల్ విసిరారు. తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న పత్రికపై న్యాయ పోరాటం చేస్తానన్నారు. చెవిరెడ్డి అవినీతి చిట్టా మొత్తం త్వరలో బహిర్గతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సక్కారి ధనంజయ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, ఏజీ పల్లి బాల, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - కోట: కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలోని గూడలి,చంద్రశేఖరపురం గ్రామాలలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ద్వారా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరంను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్తులు భారీగా వచ్చి రక్త పరీక్షలు చేసుకోవడం జరిగింది.పరీక్షలు అనంతరం పలువురు కు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథి రెడ్డి,పంచాయతీ కార్యదర్శి కిరణ్ లు మాట్లాడుతూ సాధారణ రక్త పరీక్షలు కాకుండా ఇలాంటి అసాధారణ క్యాన్సర్ నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వి ఓ పి ఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, స్విమ్స్ ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతే లక్ష్యం

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: పచ్చదనం, పరిశుభ్రత లక్ష్యంగా నిర్దేశించుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దామూతో కలిసి కుప్పంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పట్టణ పరిధిలో పలు విద్యాలయాలు ఏర్పాటు అయినందున విద్యార్థులు అధిక సంఖ్యలో పట్టణంలోనే నివాసం ఉంటున్నారని, అయితే పెరిగిన జనాభాకు అనుగుణంగా పచ్చదనం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. రోడ్డు, మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన పట్టణ నిర్మాణం సాధ్యమన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ప్రతి బడి ఒక భరతమాత గుడి కావాలి'

భరత మాత చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రతి పాఠశాల భరత మాత గుడి కావాలని క్రీడా కన్వీనర్ మాండవ్య అన్నారు. సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాల హెచ్ఎంలతో కలిసి భరత మాత చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీచ్ గ్లోబల్ ఊపాండేషన్ వారి ఆధ్వర్యంలో ఆఫీస్ భరత మాత చిత్ర పటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్వేటినగరం మండలంలో ప్రతి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా భరత మాత చిత్రపటాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కర్ణం గిరిబాబు, జిల్లా కార్యదర్శి విజయ్, హెచ్ఎం కేశవులు, ఉపాధ్యాయులు హరిత, గుణ పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మన్నారుస్వామి సమేత పచ్చయమ్మన్ కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం 34 డివిజన్ పరిధిలోని చొట్టపల్లిలో వెలసిన శ్రీ మన్నారుస్వామి సమేత పచ్చయమ్మన్ ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు తిరుకుమరన్, ఆయన సతీమణి, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కో - ఆప్షన్ సభ్యులాలు నళిని తిరుకుమరన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన భద్రకాళి ఆస్థాన మఠం పీఠాధిపతి సింధు మాతాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు తిరుకుమరన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆడి నెల 5వ సోమవారం పచ్చయమ్మన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, మన్నారుస్వామి, పచ్చయమ్మన్లకు కళ్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. నాలుగో ఏడాది నిర్వహిస్తున్న ఈ కళ్యాణోత్సవ వేడుకలకు చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లె, నగర పరిసర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందించారు.

న్యాయస్థానానికి హాజరైన టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం న్యాయస్థానానికి స్థానిక టిడిపి నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులుతో పాటు సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ సైతం సోమవారం హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ 2019 - 24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం టిడిపి నాయకులను ఎన్నో విధాల ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ముఖ్యంగా అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించడానికి సైతం వీలు లేదంటూ వైసిపి నాయకులు అడ్డుపడుతూ తెలిసిందే అన్నారు. ఈ ఘటనను అడ్డుపెట్టుకొని అప్పటి అధికార ప్రభుత్వం ప్రభుత్వం తెలుగు తమ్ముళ్లపై 307సెక్షన్ క్రింద అక్రమంగా కేసు నమోదు చేసిందని, ఈ కేసు విచారణలో భాగంగా నేడు న్యాయస్థానానికి హాజరు కావడం జరిగిందన్నారు. టిడిపి నాయకులు ఎల్లప్పుడూ న్యాయస్థానాన్ని గౌరవిస్తూ, చట్టానికి కట్టుబడి ఉంటామని, కావున న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందన్న ధీమా వ్యక్తం చేశారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-రామకుప్పం: మండల తహశీల్దార్ కె.బాబును సోమవారం టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆయనకు పూలమాలలు, దుశ్శాలువతో సత్కరించారు. మండలంలో రెవెన్యూ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాటిని సత్వరమే పరిష్కరించాలని ఈ సందర్భంగా నేతలు కోరారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు ఇసుక, మద్యం, గంజాయి, నాటు సారా తరలించే వారిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు ఆంజనేయ రెడ్డి, కుప్పం నియోజకవర్గ రైతు అధ్యక్షులు చలపతి, విజయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ బాబు, పెరుమాళ్, అల్లి శీన, నియాజ్, భానుమూర్తి పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబును సోమవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మోహన్ మురళి, లోకనాథ్ రెడ్డి, మునిచంద్రారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, గంగయ్య, బాబురెడ్డి, భాస్కర్ రెడ్డి, చంద్రబాబు రెడ్డి, తదితరులు తహశీల్దార్‌ను సన్మానించారు.

గనుల శాఖ మంత్రిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం నియోజకవర్గ మైనారిటీ విభాగ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, మైనారిటీ నాయకులు ఫైరోజ్‌లు సోమవారం రాష్ట్ర భూగర్భ, గనుల శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మంత్రిని శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛంతో అభినందించారు.

దుకాణానికి నిప్పంటించిన దుండగులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద పలమనేరుకు వెళ్లే మార్గంలోని పాదరక్షల షాపుకు ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. సుమారు 11గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానికులు గమనించి ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపుచేశారు. పాదరక్షల దుకాణంలో వ్యాపించిన మంటలతో పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాప్ దగ్ధమైంది. సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులంటున్నారు.

మల్లిచెట్టుపై యాసిడ్ పోసి..

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మహమ్మద్ వీధిలో అబ్దుల్ రహీం సాహెబ్ నాటిన మల్లి చెట్టుపై గుర్తు తెలియని వ్యక్తులు యాసిడ్ పోశారు. దీంతో చెట్టు పూర్తిగా ఎండిపోయింది. దివ్యాంగుడైన అబ్దుల్ రహీం ప్రతి నెలా సుమారు రూ.6వేలు ఆదాయాన్ని సంపాదించేవారు. ఆదరవుగా ఉన్న చెట్టుపై దుండగులు యాసిడ్ పోయడంతో చెట్టు పూర్తిగా ఎండి మాడిపోయింది. చెట్టుపై యాసిడ్ దాడి చేసినట్టే తనపై దాడి చేసేవారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కార్వేటినగరం: మహిళ ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని చాకలివాని గుంట ఎస్సీ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చాకలివాని గుంట ఎస్సీ కాలనీకి చెందిన వరలక్ష్మి (42) ఆమె భర్త 10సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుమారుడు శ్యామ్ గోవాలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే గత నాలుగు రోజుల క్రితం ఒంటరి జీవితాన్ని జీర్ణించుకోలేక ఎస్సీ కాలనీ సమీపంలోని మామిడి తోటలో ఉరివేసుకుని మృతి చెందింది. అయితే వరలక్ష్మి కనిపించక పోవడంతో ఆమె సోదరుడు మనోహర్ తన సోదరి వరలక్ష్మి కనిపించ లేదని ఫిర్యాదు చేశారు. అయితే సోమవారం ఉదయం గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో గుర్తు తెలియని మహిళ మృత దేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించడంతో ఆమె సోదరుడు అక్కడకు చేరుకుని కుళ్లిపోయి మహిళ మృత దేహానికి ఉన్న దుస్తులు గుర్తించి వరలక్ష్మిగా గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలంలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మనిక్యం తెలిపారు.